క్లుప్తంగా

డ్రోన్ సర్వే ప్రారంభం



డి.పోలవరంలో డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తుని రూరల్: మండలంలోని డి.పోలవరం, అటికెవానిపాలెం గ్రామాల్లో జగనన్న భూహక్కు–భూరక్ష పథకంలో చేపట్టే డ్రోన్ సర్వేకు బుధవారం అధికారులు శ్రీకారం చుట్టారు. ఆయా గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ నాయకులు భూముల రీసర్వేను ప్రారంభించారు. భూముల రీ సర్వేతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని పార్టీ నాయకులు చింతల వెంకటరమణ, చిటికెల వరహాలబాబు, గోసుల కృష్ణ పేర్కొన్నారు. రీ సర్వేకు రైతులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అటికె వీర్రాజు, సర్వేయర్లు నాగేశ్వరరావు, గోవిందు, డ్రోన్ పైలట్‌లు అర్జున్, రాజశేఖర్, శివరామ్, మణికంఠస్వామి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురం గ్రామంలో బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ పీతల నూకరాజు ప్రారంభించారు. ప్రస్తుత వేసవి నేపథ్యంలో వాహనదారులు, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు సర్పంచ్ తెలిపారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామరాజువర్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున గ్రామాల్లో దాతలు ముందుకు వచ్చి విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రత్తిపాడు సీఐ కె.కిషోర్‌బాబు కోరారు. స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ వద్ద ఉదయ్‌కిరణ్ ఆటో ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున ప్రజలు అవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావద్దని హెచ్చరించారు. ఎస్సై ఎం.పవన్‌కుమార్, బార్ అసోసియేషన్ ప్రతినిధి బి.మధుబాబు పాల్గొన్నారు.

నేడు రామవరంలో గడపగడపకూ..

జగ్గంపేట: మండలంలోని రామవరంలో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ హరికృష్ణ బుధవారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

23న గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

గోకవరం: వీరలంకపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 23న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఎంయూవీ రాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఐదో తరగతి విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, హాల్ టిక్కెట్, ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ఎంటీయూ 1156 రకం ధాన్యం కొనుగోలుకు చర్యలు

గోకవరం: మండలంలో ఎంటీయూ 1156 రకం ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలుకు సివిల్ సప్లయి అధికారులు ఆదేశాలు జారీ చేశారని ఎంపీపీ సుంకర శ్రీవల్లి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. మండలంలో 1156 రకం ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందిని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారన్నారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఈ రకం ధాన్యాన్ని కొనుగోలు చేస్తారని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కాగా ఇదే అంశంపై జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ కాకినాడతో జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు, ఎంపీడీఓ కేఎస్ఎస్ మూర్తి, ఏఓ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ చైత్ర మాసోత్సవాలు

అన్నవరం: రత్నగిరి తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి చైత్రమాస జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 11న అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ప్రతిరోజూ అమ్మవారికి ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ పండితులు లక్ష కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కాగా అమావాస్య సందర్భంగా గురువారం నిర్వహించే చండీహోమంతో అమ్మవారి చైత్రమాసోత్సవాలు ముగియనున్నాయి.



లోవ కొత్తూరు తలుపులమ్మ సన్నిధిలో కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు



జగ్గంపేటలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చంటిబాబు



వి.కొత్తూరు జాతరోత్సవాల్లో పాల్గొన్న మంత్రి దాడిశెట్టి రాజా, నాయకులు

ఊరూరా జాతర

గంధామావాస్యను పురస్కరించుకుని తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో గ్రామ దేవతల జాతర మహోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రజాప్రతినిధులు, వేలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

- వైభవంగా అమ్మవార్ల జాతరోత్సవాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తుని రూరల్: మండలంలోని లోవకొత్తూరుతో సహా మరో పది గ్రామాల్లో తలుపులమ్మ అమ్మవారికి జాతరోత్సవాలు బుధవారం రాత్రి వైభవోపేతంగా జరిగాయి. లోవ దేవస్థానం ఆధ్వర్యంలో లోవకొత్తూరులో జరిగిన జాగరణ, ఉత్సవాలను లోవ చైర్మన్ గొర్లి అచ్చియ్య నాయుడు, ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు లాంఛనంగా ప్రారంభించారు. లోవకొత్తూరులో గల నాలుగు ఎకరాల ప్రాంగణంలో ఉన్న ఆలయంలో తలుపులమ్మ తల్లిని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. కేరళ యువకులతో డప్పులు డ్యాన్స్, బోనాలతో మహిళల కోలాటం, మహిళలతో కాగడా డ్యాన్స్, టీవీ ఆర్టిస్టులు, డీజే కళాకారులతో స్టేజి ప్రోగ్రాం, వివిధ దేవతామూర్తులు వేషధారణలు (శక్తివేషాలు) ప్రదర్శించారు. వి.కొత్తూరు, కుమ్మరిలోవ, తాళ్లూరు, కొత్త వెలంపేట, సీతయ్యపేటు, జగన్నాథగిరి, గెడ్లబీడు, రాజుపేట, మర్లపాడు, వెలంపేట కాలనీల్లో ఆయా కమిటీల ఆధ్వర్యంలో జాతరోత్సవాలను ఘనంగా నిర్వహించారు. బళ్లవేషాలు, టీవీ కళాకారులతో డీజే ప్రోగ్రాలు విశేషంగా అలరించాయి. రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా వి.కొత్తూరులో జరిగిన సంబరాల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, సర్పంచులు దుంగల గణపతి రోజారాణి, నాయకులు దుంగల నాగేశ్వరరావు, లంక కృపానందం, సకురు నాగేంద్ర నెహ్రూ, వంగలపూడి గోవిందుబాబు అమ్మవార్లను దర్శించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సీఐ సన్యాసిరావు, ఎస్సైలు ఎ.బాలాజీ, స్వామినాయుడు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

నేడు అమ్మవారి తీర్థం

లోవకొత్తూరులో జాతర మహోత్సవాలు ముగింపు సందర్భంగా గురువారం అమ్మవారి ఊరేగింపు, తీర్థం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కళాకారులతో వివిధ వేషధారణలు, భీమవరం వారితో సంగీత విభావరి ఏర్పాటు చేశారు.

వేములమ్మతల్లి జాతర

రౌతులపూడి: మండలంలోని బీబీ పట్నంలో బుధవారం వేములమ్మ తల్లి జాతరను ఘనంగా నిర్వహించారు. మహిళలు వసంత జలాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని వసంత జలాలను అమ్మవారికి అభిషేకించారు. భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



చింతలూరులో బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

జగ్గంపేటలో రాజమ్మతల్లి జాతర

జగ్గంపేట: గ్రామ దేవత రాజమ్మతల్లి జాతర మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆరు రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గరగనృత్యాలు, బాణసంచా కాల్పులు, డ్యాన్స్‌లు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గ్రామ ఉపసర్పంచ్ బండారు రాజా, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పెద్దాడ రాజబాబు పాల్గొన్నారు.

కోటనందూరు: గంధామావాస్యను పురస్కరించుకుని కాకరాపల్లిలో మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. పరిసర గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. సాయంత్రం గ్రామ వీధుల్లో కలశయాత్ర నిర్వహించారు. రాత్రికి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి.

చింతాలమ్మతల్లి బోనాల పండగ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని చింతలూరులో వేంచేసిన చింతాలమ్మతల్లి బోనాల పండగ బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలు ధరించి గ్రామ శివారున ఉన్న చింతాలమ్మతల్లి ఆలయం వరకూ ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి పూజలు చేశారు.

నేడు నల్లకొండమ్మ జాతర

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లిలో వేంచేసిన నల్లకొండమ్మతల్లి జాతర మహోత్సవం గురువారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఈ మేరకు అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయం వద్ద చలువ పందిళ్లు, భక్తులకు క్యూ లైన్లు ఏర్పాటు చేశారు.



బీబీ పట్నంలో అమ్మవారికి వసంత జలాలను తీసుకువెళుతున్న మహిళలు



కాకరాపల్లిలో మరిడమ్మను దర్శించుకుంటున్న భక్తులు

వైఎస్సార్ సీపీలో 100 మంది చేరిక

ఏలేశ్వరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించి, మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. పట్టణానికి చెందిన యువయువ ఎలక్ట్రికల్, రీ వైండింగ్, ప్లంబింగ్ యూనియన్ ఆధ్వర్యంలో సుమారు వంద మంది బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. యూనియన్ అధ్యక్షుడు ఉప్పా రాజు, ఉపాధ్యక్షుడు పేకేటి సూర్యప్రకాష్, కార్యదర్శి పాలకూరి వీరబాబు తదితరులకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో ప్రతి గడపకూ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను చూసి ఇతర పార్టీల నేతలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అలమండ చలమయ్య, శిగడం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

ముస్లింలకు ఎమ్మెల్యే చంటిబాబు ఇఫ్తార్ విందు



జగ్గంపేట మసీదులో ముస్లింలకు వంటకాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



ఏలేశ్వరం ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

జగ్గంపేట: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లింలకు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక మసీదు ఆవరణలో ఏర్పాటు చేసిన విందులో ముస్లింలకు ఎమ్మెల్యే స్వయంగా వడ్డించారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్యే చంటిబాబుకు ఆశీర్వచనలు అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మసీదు అధ్యక్షుడు షేక్ సలీం, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ సయ్యిద్ బాజీ, మసీద్ గురువు షేక్ అబ్దుల్లా, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇళ్ల అప్పారావు కాపు, వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ బండారు రాజా, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు, కంచి లక్ష్మణదొర తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ముస్లింలకు బుధవారం ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ఇఫ్తార్ విందు ఇచ్చారు. స్థానిక మార్కెట్‌లోని మసీద్ వద్ద ముస్లింలతో కలిసి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకులు ఇఫ్తార్ విందు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ముస్లింలకు గుర్తింపులేదన్నారు. ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



కాకినాడలో కలెక్టర్ కృతికా శుక్లాను కలిసిన జెడ్పీటీసీలు బిందుమాధవి, మంగతాయారు

జగ్గంపేట: జగ్గంపేట, గండేపల్లి మండలాల్లోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యులు ఒమ్మి బిందుమాధవి, పరిమి మంగతాయారు కోరారు. ఈ మేరకు బుధవారం కాకినాడలో జిల్లా కలెక్టర్ కృతికాశుక్లాను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. కాకినాడలో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సమావేశం అనంతరం కలెక్టర్‌ను కలిసినట్టు జగ్గంపేట జెడ్పీటీసీ సభ్యురాలు ఒమ్మి బిందుమాధవి తెలిపారు. జగ్గంపేట జగనన్న కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మాణం, జగ్గంపేట నుంచి పలు గ్రామాలకు వెళ్లే రహదారుల అభివృద్ధి, రాజపూడి సబ్‌స్టేషన్ పరిధిలో నివాస స్థలాల పైనుంచి వెళుతున్న 11 కేవీ విద్యుత్ లైన్ల మార్పుతో పాటు మరో 10 సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లినట్టు చెప్పారు. అలాగే గండేపల్లి మండలంలో సమస్యలను పరిష్కరించాలని గండేపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు పరిమి మంగతాయారు కలెక్టర్‌ను కోరారు. సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని జెడ్పీటీసీ సభ్యులు తెలిపారు.

యువకుడి అదృశ్యంపై కేసు



దుర్గాప్రసాద్ (ఫైల్)

జగ్గంపేట: యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విద్యాసాగర్ బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కాట్రావులపల్లి గ్రామం సోమరాజపేట ప్రాంతానికి చెందిన బొడ్డు దుర్గాప్రసాద్ తల్లిదండ్రులతో కలిసి చెన్నైలో ఉంటున్నాడు. ఇంటర్ పరీక్షలు రాయడానికి చెన్నై నుంచి కొద్ది రోజుల క్రితం తన సోదరుడు ఇంటికి కాట్రావులపల్లి వచ్చాడు. పరీక్షలు రాసిన అనంతరం దుర్గాప్రసాద్ ఈ నెల 1న చెన్నైలోని తల్లిదండ్రుల వద్దకు బయలుదేరాడు. ఇప్పటికీ దుర్గాప్రసాద్ తమ వద్దకు చేరుకోకపోవడంతో తల్లితండ్రులు ఆందోళన చెందారు. కాట్రావులపల్లి వచ్చి తమ బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికారు. అయినా యువకుడి ఆచూకీ లభించకపోవడంతో బుధవారం జగ్గంపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దుర్గాప్రసాద్ ఆచూకీ తెలిసిన వారు 94407 96569 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్సై విద్యాసాగర్ కోరారు.

బొర్రంపాలెంలో మరో యువకుడు..

గండేపల్లి: యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై వై.గణేష్ కుమార్ బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని బొర్రంపాలెం గ్రామానికి చెందిన కాతేటి దుర్గ తాళ్లూరులోని ఓ దాబాలో పని చేస్తున్నాడు. ఈ నెల 3వ తేదీ రాత్రి 10 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో గాలించారు. అయినా దుర్గ ఆచూకీ లభించకపోవడంతో అతని తండ్రి సత్తిబాబు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

ఏలేశ్వరం: అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డు, షిర్డీ నగర్‌లోని పార్క్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేశామన్నారు. స్థానిక ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించామన్నారు. నగర పంచాయతీ పరిధిలోని పార్క్‌లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అలమండ చలమయ్య, శిగడం వెంకటేశ్వరరావు, దోశె కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో పార్క్ శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఇంటింటా జగనన్నే మా భవిష్యత్

కిర్లంపూడి: మండల వ్యాప్తంగా బుధవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆదేశాల మేరకు స్థానిక ఎస్సీ పేటలో వైఎస్సార్ సీపీ నాయకుడు మూరా శ్రీను ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. కిర్లంపూడి సొసైటీ అధ్యక్షుడు చదలవాడ బాబీ, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు దోమాల గంగాధర్ తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం చేపట్టి 13 రోజులు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. వైఎస్సార్ సీపీ నాయకులు బంగారు వెంకట రమణ, మంత్రా చిట్టిబాబు, శరకణం సంతోష్, లంక మూర్తి, దాడి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



కిర్లంపూడిలో కేక్ కట్ చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు

పేదలకు న్యాయం చేయాలంటూ ధర్నా

ఏలేశ్వరం: ఇళ్లు లేని నిరుపేదలకు న్యాయం చేయాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్)వినోద్ మిశ్రా పార్టీ నాయకులు పట్టణంలో బుధవారం ధర్నా చేశారు. ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ లింగంపర్తిలో సుమారు 25 కుటుంబాలు దేవస్థానం భూముల్లో నివాసం ఉంటున్నాయన్నారు. ఆ భూములను ఖాళీ చేయించేందుకు అధికారులు చర్యలు చేపట్టారన్నారు. ఈ నిర్ణయంతో పేదలు తీవ్రంగా నష్టపోతారని, పేదల పట్ల సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గుర్రం ఈశ్వరి, పోసిన నాగమణి, లక్ష్మి, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వినోద్ మిశ్రా పార్టీ శ్రేణులు

సంపద కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలి

తొండంగి: గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలని పెద్దాపురం డీఎల్‌పీఓ ఎం.బాలామణి సూచించారు. మండలంలోని తొండంగి, బెండపూడి, శృంగవృక్షం, ఎ.కొత్తపల్లి తదితర గ్రామాల్లో పారిశుధ్య పనులు, తాగునీటి వాటర్ ట్యాంకుల నిర్వహణ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను బుధవారం ఆమె పరిశీలించారు. అనంతరం తొండంగి మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీ ఎస్.సత్యప్రసాద్‌తో కలిసి పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో పారిశుధ్య పరంగా తీసుకున్న చర్యలను పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. ఇంటి పన్నులు, వ్యాపార సముదాయాలు, చిన్నతరహా పరిశ్రమలకు సంబంధించి పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. పంచాయతీల నిర్వహణకు సంబంధించి పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులు వాడ్రేవు చక్రవర్తి, రాజబాబు, ప్రేమ్‌కుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.



తొండంగిలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షిస్తున్న డీఎల్‌పీఓ బాలామణి

విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతి

గోకవరం: మండలంలోని అచ్యుతాపురం పుష్కర కాలువలోకి తాగునీటి కోసం దిగిన పాడిగేదె విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. వివరాల్లోకి వెళితే..అచ్యుతాపురం గ్రామంలోని జాజుల శివన్నారాయణకు చెందిన పాడిగేదె బుధవారం గ్రామ శివారున ఉన్న పుష్కరకాలువలోకి నీటి కోసం దిగింది. ఈ క్రమంలో కాలువలో సాగునీటి కోసం అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ మోటారు వైర్లు తగిలి మృత్యువాత పడింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని రైతు తెలిపారు. గెదె మృతితో తమ జీవనోపాధి కోల్పోయామని, ప్రభుత్వపరంగా ఆదుకోవాలని రైతు శివన్నారాయణ కోరారు.

రెండు కరోనా కేసులు నమోదు

రౌతులపూడి: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో బుధవారం కరోనా పరీక్షలు చేశారు. అనకాపల్లి జిల్లా నాతవరం మండలానికి చెందిన భార్య, భర్తలకు కరోనా పాజిటివ్ వచ్చిందని రౌతులపూడి సీహెచ్‌సీ వైద్యాధికారి జానికీదేవి తెలిపారు. వీరిని మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించామని చెప్పారు.